పేరుకే ప్రథమ శ్రేణి!

- 70 ఏళ్లయినా సొంత భవనానికి నోచుకోని గ్రంథాలయం
- ఇరుకు గదిలో నిర్వహణ
- పాఠకులకు తప్పని ఇక్కట్లు



అద్దె భవనంలో నడుపుతున్న ప్రభుత్వ గ్రంథాలయం

గుంతకల్లు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో పాఠకులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతోపాటు గ్రంథాలయంలో అమూల్యమైన పుస్తకాలకు చెదలు పడుతున్నాయి. గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలమున్నా నిధులు విడుదల చేయకపోవడంతో సొంత భవనం కలగా మారింది. పట్టణంలో 1955లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సోఫియాస్ట్రీట్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. లైబ్రరీ పైఅంతస్తులో ఉండటం వల్ల దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

స్థలమున్నా.. భవనం నిర్మించరే..

గ్రంథాలయ భవనం కోసం 2013లో కసాపురం రోడ్డులోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద 3 సెంట్ల విలువైన రెవెన్యూ స్థలాన్ని మంజూరు చేశారు. అయితే సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకుని రక్షించుకోవడంలో అప్పటి గ్రంథాలయాధికారులు విఫలమయ్యారు. ఆ తర్వాత పాతగుంతకల్లులోని శివాలయం వద్దనున్న సర్వేనెం.468–బిలోని 10 సెంట్ల స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి 2015–16లో రూ.10 లక్షల మున్సిపల్ నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అయితే ఆ స్థలం ప్రభుత్వభూమి అని తేలడంతో మున్సిపాల్టీ వారు పనులను అర్ధంతరంగా ఆపేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ రంగయ్య చొరవతో అదే స్థలంలో ప్రభుత్వ గ్రంథాలయ నిర్మాణానికి నిరభ్యంతర సర్టిఫికెట్ మంజూరు చేస్తూ 2023 నవంబర్‌లో మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం కూడా తెలిపింది. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రంథాలయ శాశ్వత భవన నిర్మాణానికి నిధులివ్వాలని పాఠకులు కోరుతున్నారు.

పాఠకులతో కిటకిట..

సుమారు 26 వేల పుస్తకాలు కలిగిన ఈ గ్రంథాలయం ఎందరినో ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దింది. రోజూ విద్యార్థులు, పోటీ పరీక్షలకి సిద్ధమయ్యే నిరుద్యోగ యువత, పాఠకులతో రద్దీగా ఉంటుంది. ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు గ్రూప్–1, ఎస్సై, కానిస్టేబుల్, ఆర్ఆర్‌బీ, డీఎస్సీ, డీఎడ్, ఎడ్‌సెట్ వంటి తదితర పోటీపరీక్షలకి సన్నద్ధమవుతోన్న నిరుద్యోగ యువతకు అవసరమైన సమాచారమంతా ఇక్కడ ఉంటుంది. అంతేకాకుండా ఆధ్యాత్మిక, బాలల విభాగాలతో పాటు ఎనిమిది భాషలకు సంబంధించిన నవలలు, కంప్యూటర్ విజ్ఞాన, సాధారణ గ్రంథాలు, తత్వ, మనోవిజ్ఞాన శాస్త్రం తదితర విలువైన పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతాయి. మరిన్ని పోటీపరీక్షలు పుస్తకాలు అందుబాటులో ఉంచాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

నిధులివ్వాలని కోరాం



పాతగుంతకల్లులో గ్రంథాలయానికి సంబంధించిన 10 సెంట్ల స్థలంలో భవన నిర్మాణానికి ఎన్‌ఓసీ ఇస్తూ మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఈ స్థలంలో గ్రంథాలయ శాశ్వత భవన నిర్మాణానికి నిధులివ్వాలని గ్రంథాలయ సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులివ్వగానే పనులు పూర్తి చేయిస్తాం.

– పి.కమ్మన్న, గ్రంథాలయాధికారి, గుంతకల్లు

దివ్యాంగులు రావాలంటే కష్టం



రైల్వే గ్రూప్–డి పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నా. రోజూ 6 కి.మీ దూరం నుంచి గ్రంథాలయానికి వస్తా. 70 ఏళ్లు గడుస్తున్నా గ్రంథాలయానికి సొంతభవనం లేకపోవడం దురదృష్టకరం. మొదటి అంతస్తులో ఉన్న ఈ గ్రంథాలయానికి వృద్ధులు, దివ్యాంగులు రావాలంటే కష్టంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం సొంత భవనాన్ని నిర్మించాలి.

– కళ్యాణ్‌కుమార్, పాఠకుడు, జి.కొట్టాల

పోటీ పరీక్షల మెటీరియల్ ఉంచాలి



నేను గ్రూప్–2 పరీక్ష ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. గుంతకల్లులో రూమ్‌ను అద్దెకు తీసుకుని చదువుకుంటున్నా. గ్రంథాలయ శాశ్వత భవనాన్ని నిర్మించి అనేక మందికి విజ్ఞానాన్ని పెంపొందించాలి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల నియామకానికై నోటిఫికేషన్లు ఇచ్చిన నేపథ్యంలో నిరుద్యోగులకు అవసరమైన పోటీపరీక్షల స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలి.

– లింగమూర్తి, గ్రూప్–2 అభ్యర్థి

క్లుప్తంగా

గ్యాస్ ప్రమాదంలో ఆస్తినష్టం



మంటల్లో కాలిపోయిన వస్తువులు

గుంతకల్లు రూరల్: నాగసముద్రం గ్రామంలో శుక్రవారం గ్యాస్ లీకేజీ కారణంగా కిరాణా షాపులో మంటలు చెలరేగి రూ.50 వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. గ్రామానికి చెందిన సీతమ్మ గ్రామ బస్టాండ్ సమీపంలో కిరణాషాపుతో పాటు హోటల్ నిర్వహిస్తోంది. శుక్రవారం సాయంత్రం గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగి కిరణా షాపులో ఉన్న తినుబండారాలతోపాటు, ఫ్రిడ్జి కాలిపోయింది. దీంతోపాటు షాపులో ఉన్న రూ.25 వేల నగదు మంటల్లో కాలిపోయిందని బాధితురాలు వాపోయింది.

రేషన్ తూకంలో మోసం



తూకం మిషన్‌పై డబ్బా ఉంచిన దృశ్యం

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత రేషన్ షాపులలో అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. పేదలకు బియ్యం సక్రమంగా అందించాల్సిన డీలర్లు పేదల నోట్లో మట్టి కొడుతున్నారు. వివరాలు.. మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీ, అనంత సాగర్ కాలనీలో రేషన్ షాపును టీడీపీకి చెందిన వారు నడుపుతున్నారు. రేషన్ షాపులో పేదలకు బియ్యం వేసే సమయంలో తూకం మిషన్‌పై సంచి కాకుండా డబ్బా ఉంచి, బియ్యం వేస్తున్నారు. 10, 20 కేజీలకు 2 నుంచి 3 కేజీల బియ్యం తక్కువ తూకం వేస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. వీటికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అక్రమాలకు పాల్పడుతున్న రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

సింహ వాహనంపై రంగనాథుడు



అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు రంగనాథుడు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సహిత రంగనాథుడి ఉత్సవ విగ్రహాలను రంగు, రంగుపూలతో అలంకరించి సింహ వాహనంపై ఉంచి జమ్మి చెట్టు వరకూ ఊరేగించారు. ఆలయ అర్చకులు పలుకూరి రవికుమార్, చేతన్‌వర్మ, లిఖిల్‌వర్మ, నవీన్‌కుమార్‌లు వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ రామాంజనేయులు, సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్‌లు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్ తిరునాల సందర్భంగా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడిపత్రి అర్బన్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పట్టణంలోని నంద్యాల రోడ్డు, కడప రోడ్డు యల్లనూరు రోడ్డు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నపుడు వామపక్ష పార్టీలతో కలిసి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించింది. అధికారంలోకి వచ్చాక తిరిగి స్మార్టు మీటర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మండిపడ్డారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీని విస్మరించి రూ.15,484 కోట్ల అదనపు భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. పేదల ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రంగయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, మండల కార్యదర్శి నాగయ్య, శ్రీరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం



తాడిపత్రి/పెద్దవడుగూరు: తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పట్టణం, మండలాలకు అధ్యక్షులను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఆయా మండలాలకు సమర్థవంతమైన, పార్టీలో క్రియాశీలకంగా ఉన్న వారికి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పెద్దపీట వేశారు. తాడిపత్రి పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ జావీద్ ఖాద్రి, తాడిపత్రి మండలాధ్యక్షుడిగా పల్లె నాగేశ్వర్‌రెడ్డి, పెద్దపప్పూరు మండల అధ్యక్షుడిగా ముచ్చుకోట అమర్‌నాథ్ రెడ్డి, యాడికి మండల అధ్యక్షుడిగా మంగళ సంజీవ రాయుడు, పెద్దవడుగూరు మండల అధ్యక్షుడిగా ఎద్దుల శరభారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. పదవులను కేటాయించిన మాజీ సీఎం వైఎస్ జగన్, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

నలుగురు ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురం వద్దనున్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు నలుగురు ఉద్యోగాలకు ఎంపికయినట్లు కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో ఇటీవల కళాశాలలో లూమెన్ టెక్నాలజీ కంపెనీ వారు లుమెన్ క్వెస్ట్–2025 హాకథాన్ ద్వారా లూమెన్ టెక్నాలజీస్ వారు ఇంటర్వ్యూలు నిర్వహించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ రిక్రూట్‌మెంట్ ప్రోగ్రాంలో నలుగురు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రారంభంలో నెలకు రూ.30 వేల వేతనంతో 6 నెలలు ఇంటర్న్‌షిప్ పొందుతారన్నారు. తర్వాత వార్షిక వేతనంగా 7.5 లక్షలు ప్యాకేజీ ఉంటుందన్నారు. కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఎస్ఆర్ఐటీ కళాశాల విద్యార్థులు నలుగురు మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీలో శైలజానాథ్ చేరికపై సంబరాలు



పుట్లూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు

గార్లదిన్నె: మాజీమంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో శుక్రవారం పార్టీలోకి చేరడంతో ఆయన అణుచర వర్గం నాయకులు, కార్యకర్తలు గార్లదిన్నెలో సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా బస్టాండ్ సర్కిల్లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులార్పించారు. టపాసులు కాలుస్తూ సంబరం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ శైలజానాథ్ వెంటే తామంతా ఉంటామని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. శైలజానాథ్ నాయకత్వంలో తాము పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తలను అందరినీ కలుపుకొని పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కొనిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఓబిరెడ్డి, సాయినాథ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నాగరాజు, జయరాజు, నరసింహులు, తిరుపాల్, నరసింహులు, యల్లప్ప, ఆదెన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్ వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకోవడంతో కార్యకర్తలు, నాయకులు సంబరాలు జరుపుకున్నారు. యల్లనూరు మండలంలో అప్పటి కాంగ్రెస్ మండల కన్వీనరు భాస్కర్‌రెడ్డి , ఆయన అనుచరులు కలిసి ఆధ్వర్యంలో యల్లనూరు బస్టాండ్‌లో ఉన్న వైఎస్సార్, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల కన్వీనరు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ముఖ్య నాయకుడు విష్ణునారాయణ మాట్లాడారు. తమ నాయకుడు ఎక్కడ ఉంటే తాము అక్కడ కొనసాగుతామన్నారు. ఈకార్యక్రమంలో కార్యకర్తలు పెద్దమల్లేపల్లి వీరశేఖర్, రామశివారెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

శైలజానాథ్ చేరికతో సంబరాలు

పుట్లూరు: మాజీ మంత్రి సాకే శైలజానాథ్ వైఎస్సార్‌సీపీలో చేరడంతో మండల కేంద్రంలో శుక్రవారం నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. స్వీట్లు పంచి సంబరాలు చేపట్టారు. అనంతరం బాణాసంచా పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో కడవకల్లు విష్ణునారాయణ, రంగరాజుకుంట సూరి, గూడూరు రమణారెడ్డి, గోపాల్‌రెడ్డి, పుట్లూరు నారాయణస్వామి, కోమటికుంట్ల సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

శింగనమలలో..

శింగనమల: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. దీంతో ఆయన అనుచరులు నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.అంతకు ముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. శింగనమలలో మాజీ ఎంపీటీసీ పూల ప్రసాద్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ



బీరువాలోని దుస్తులను చిందర వందరగా పడేసిన దృశ్యం

గుత్తి: పట్టణంలోని తురకపల్లి రోడ్డులో నివాసముండే రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి తిప్పయ్య ఇంటిలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. తిప్పయ్య ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన సుమారు రెండున్నర తులాల విలువైన తాళి బొట్టులోని నాలుగు చిన్న బంగారు గుండ్లు, జత కమ్మలు, ఉంగరం ఎత్తుకెళ్లారు. సీఐ వెంకటేశ్వర్లు చోరీ జరిగిన ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుంతకల్లు రూరల్: కసాపురం రోడ్డు సమీపంలోని మైనార్టీ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు..పట్టణంలో ఆడిటర్‌గా పనిచేస్తున్న ఖలీల్ బాషా తన భార్యతో కలిసి మైనార్టీ కాలనీలో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం పని నిమిత్తం విజయవాడకు వెళ్తుండటంతో భార్యను పట్టింటికి పంపాడు. శుక్రవారం సాయంత్రం ఇంటికి రాగా ఇంట్లో ఉన్న 20 తులాల వెండి, మూడు గ్రాముల బంగారు జుంకీలు, రూ. 2 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

గుంతకల్లుటౌన్: పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు తప్పనిసరిగా కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సీ, సీ–ప్లస్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. సీ–ల్యాంగేజీ నేర్చుకోవడం ద్వారా సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించవచ్చని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ కోర్సు 45 రోజుల పాటు కొనసాగుతుందని, పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్స్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డాక్టర్ జనార్ధన్ శాస్త్రీ, అధ్యాపకులు ఓబులేసు, వెంకటేశులు, బసవరాజు, అల్తాఫ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జమీలాబీ, అకడమిక్ కోఆర్డినేటర్ శివశంకర్ శర్మ పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు

గుంతకల్లు రూరల్: నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పీ.గోపాల్ పేర్కొన్నారు. ఐటీసీ అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 60 మంది విద్యార్థులకు 15 రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సంపాదించుకోవాలంటే ప్రతి ఒక్కరూ మెరుగైన నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఐటీసీ నోడల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, కోఆర్డినేటర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సుజుకి షోరూం ప్రారంభం



సుజుకి షోరూంను ప్రారంభిస్తున్న డైరెక్టర్ రుకేశ్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: సుజుకి కంపెనీ అన్ని హంగులతో మార్కెట్‌లోకి ద్విచక్ర వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని షోరూం డైరెక్టర్ రుకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గన్నెవారిపల్లి కాలనీలో అమృత్ సుజుకి ద్విచక్ర వాహనాల షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలుదారులు ప్రారంభోత్సవ ఆఫర్లను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ శివరామకృష్ణ, ఏరియా సేల్స్ మేనేజర్ శివప్రసాద్, నెట్‌వర్క్ మేనేజర్ క్రాంతి కుమార్, సర్వీస్ మేనేజర్ చైతన్య పాల్గొన్నారు.

గుండెపోటు మరణాలు తగ్గించడమే లక్ష్యం

గుంతకల్లుటౌన్: గుండెపోటు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్టెమీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆస్పత్రి మీటింగ్ హాల్‌లో వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించి స్టెమీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఛాతీనొప్పి, ఎడమ భుజం లాగినా, ఆకస్మికంగా ఆయాసం, గుండె దడ వచ్చినా, స్పృహ కోల్పోయిన వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకొస్తే రూ.45 వేలు విలువైన టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌ను ఉచితంగా వేస్తారని తెలియజేశారు. స్టెమీ కార్యక్రమంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు.


చెన్నమయ్య స్వామి జాతర ప్రారంభం



పుట్టరూపంలో ఉన్న చెన్నమయ్య స్వామి

యాడికి: మండలంలోని రెడ్డి గుడిసెలు గ్రామ సమీపంలో కొండల్లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నమయ్య స్వామి జాతర శుక్రవారం ప్రారంభమైంది. మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఉంచిన నూతన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నమయ్య స్వాములను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చారు. యాడికి, చంద్రాయుని పల్లి, రామన్న గుడిసెలు, రెడ్డి గుడిసెలు గ్రామాల నుంచి ఊరేగింపుగా చెన్నమయ్య కోనలోని చెన్నమయ్య స్వామి దేవాలయానికి తీసుకెళ్లి కొలువుదీర్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు హరికృష్ణ దేవాలయంలో పుట్టరూపంలో ఉన్న చెన్నమయ్య స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తొలిరోజు భక్తులు తరలివచ్చి టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట



పూజలందుకున్న పెద్దమ్మతల్లి

పామిడి: పట్టణంలోని జగనన్న కాలనీలో నూతన నిర్మించిన ఆలయంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు మహదేవయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రసూల్, ఓబులేసు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని దత్తపాదుకా క్షేత్రంలో శుక్రవారం దత్తసేవాసమితి ఆధ్వర్యంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. మైసూరు దత్తపీఠం పురోహితుల సారథ్యంలో అనఘా దత్తాత్రేయుని శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సమితి సభ్యులు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్ఎస్ఎం శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పక్కాగా భూముల రీసర్వే

యాడికి: రైతుల అనుమతితోనే రీసర్వే నిర్వహించాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలో చందన రెవెన్యూ డివిజన్‌లో 66, 67, 70 సర్వే నంబర్లలో జరుగుతున్న రీ సర్వేను శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీసర్వే చేయబోతున్న సర్వే నంబర్‌లోని రైతులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి.. ఆ రైతుల సమక్షంలోనే పక్కాగా రీసర్వే చేయాలన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో 290 ఎకరాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో రీ సర్వే సిబ్బందితో సమావేశమై పలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ కేశసాయి, వీఆర్‌ఓలు రామదాసు, నరసింహారాజు, గ్రామ సర్వేయర్ రాజశేఖర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన

యల్లనూరు: చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీలకు ఆదాయాన్ని పెంచాలని అనంతపురం డీఎల్‌డీఓ లలితాబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని నిట్టూరు, పెద్దమల్లేపల్లి, యల్లనూరు చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఈఓఆర్డీ మనోహర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పెద్దవడుగూరు: పది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్‌లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు, లక్ష్ముంపల్లి జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పది విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠాలను బోధించిన అనంతరం మరొకసారి నివృత్తి చేసుకోవాలని సూచించారు. మంచి మార్కులు సాధించడానికి ఎలా రాయాలో వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనదారులకు సూచనలిస్తున్న సీఐ రామసుబ్బయ్య

పెద్దపప్పూరు: చిన్నపప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వర్థ నారాయణ స్వామి తిరునాల సందర్భంగా శుక్రవారం పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. తిరునాల సందర్భంగా శని, ఆదివారం రోజుల్లో క్షేత్రంలోకి వాహనాలను అనుమతించబోమని పేర్కొన్నారు. తిరునాల సందర్భంగా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీపీ గార్లదిన్నె రామకృష్ణారెడ్డి తెలిపారు. స్వామి దర్శనార్థం వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఘనంగా సుంకులమ్మ విగ్రహప్రతిష్ట

గుత్తి రూరల్: ఇసురాళ్లపల్లిలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఆవుల వాసుదేవరెడ్డి, రంగారెడ్డి, జయరామిరెడ్డి, ఆవుల రామకృష్ణారెడ్డి, ఆవుల బాలమల్లయ్య, ఆవుల శేషారెడ్డి, గురు హేమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, భరత్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, రాజన్న, ఎంపీటీసీ లాలెప్ప అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఆలయ ఆవరణలో భజనలు నిర్వహించారు.

స్థల పరిశీలన చేయాలని ధర్నా

గుంతకల్లు రూరల్: ప్రజా నాట్యమండలి కళాక్షేత్రం నిర్మాణం కోసం స్థల పరిశీలించాలని కోరుతూ శుక్రారం తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రజా నాట్యమండలి సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జానాట్యమండలి పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి తదితరులు మాట్లాడుతూ పట్టణంలో కళాక్షేత్రం ఏర్పాటు కోసం కలెక్టర్‌కు విన్నవించామన్నారు. స్పందించిన కలెక్టర్ స్థల కేటాయింపుకు సర్వే నిర్వహించాలని ఆదేశించి మూడు నెలలు గడుస్తున్నా సర్వేయర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్‌శాఖ ఏఈగా రవీంద్ర

యల్లనూరు: మండలంలో విద్యుత్ శాఖ ఏఈగా రవీంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఏఈగా పనిచేస్తున్న రవీంద్రను యల్లనూరుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జ్ ఏఈ పద్మనాభరెడ్డిని ఏడీఏ కార్యాలయంలో సబ్ ఇంజనీరుగా పంపారు.

కంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పుట్లూరు: ఈ ఏడాది ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ కాత్యాయని తెలిపారు. ఇందుకోసం రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే క్వింటా రూ.7,550 ప్రకారం కందులు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పుట్లూరు సొసైటీ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.